క్లుప్తంగా

వైద్య శిబిరానికి విశేష స్పందన

కూచిపూడి(మొవ్వ): మొవ్వ మండలం పెదపూడిలోని కూచిపూడి – పెదపూడి వర్తక సంఘ కల్యాణ మండపంలో ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ మొవ్వ మండల శాఖ ఆధ్వర్యంలో కాశీబొట్ల నారాయణ మూర్తి సహకారంతో చేపట్టిన ఈ శిబిరానికి పరిసర ప్రాంతాలకు చెందిన 120 మంది వైద్య పరీక్షలు పొందారు. నాగమణి రెటీనా ఇనిస్టిట్యూట్ ఆఫ్ సూపర్ స్పెషాలిటీ కంటి హాస్పిటల్ మచిలీపట్నం వైద్యుడు గొరిపర్తి పవన్‌కుమార్ పరీక్షలు నిర్వహించి 36 మందికి డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య శ్రీ పథకం ద్వారా ఉచిత ఆపరేషన్‌లకు సిఫార్సు చేశారు. సొసైటీ చైర్మన్ బెల్లంకొండ వెంకటేశ్వరరావు, సభ్యులు కోనేరు రాజేంద్రప్రసాద్, దోనేపూడి శివరామయ్య, మద్దాల కామేశ్వరరావు, పి.వెంకటేశ్వరరావు పర్యవేక్షించారు.

మృతురాలి కుటుంబానికి ఎమ్మెల్యే కైలే పరామర్శ



పామర్రు: స్థానిక ఎన్టీఆర్ కాలనీకి చెందిన ఎరుకుల సంఘ నాయకుడు శీలం వెంకటేశ్వరరావు భార్య శీలం రమణ(46) అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ మృతురాలి పార్థివ దేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబసభ్యులకు తమ ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. పరామర్శించిన వారిలో వైస్ ఎంపీపీ ఆరేపల్లి శ్రీనివాసరావు, ఎంపీటీసీ తాడిశెట్టి శ్రీనివాసరావు, నాయకులు సజ్జా సుబ్రహ్మణ్యం, సజ్జా ప్రకాశ్, శీలం పానకాలు, సజ్జా వెంకటకృష్ణ, శీలం కిరణ్ ఉన్నారు.

ప్రభుత్వ పథకాల అమలు పరిశీలన

తోట్లవల్లూరు: కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు తీరును కేంద్ర ప్రభుత్వ మానిటరింగ్ బృందం పరిశీలించింది. మండలంలోని కుమ్మమూరు, కనకవల్లి గ్రామాల్లో డీపీఎం వై.రాజగోవింద్ ఆధ్వర్యంలోని కేంద్ర మానిటరింగ్ బృందం ఆదివారం పర్యటించింది. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పలు పథకాలను క్షేత్రస్థాయిలో పరిశీలించటంతో పాటు ఆయా పథకాలకు సంబంధించిన లబ్ధిదారులతో మాట్లాడారు. బృందం సభ్యులు సంతృప్తి వ్యక్తం చేశారు. ఉపాధిహామీ ఏపీడీ శ్రీలత, ఎంపీడీఓ తుంగల స్వర్ణలత, సర్పంచ్‌లు బొమ్మారెడ్డి వెంకటేశ్వరరెడ్డి, పీవీ నరసింహశర్మ, ఆయా పంచాయతీల సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి లెప్రసీపై అవగాహన కార్యక్రమాలు

పామర్రు: మహాత్మా గాంధీ వర్ధంతి(షహీద్ దివాస్)ను పురస్కరించుకుని సోమవారం నుంచి ఫిబ్రవరి 13వ తేదీ వరకు లెప్రసీపై అవగాహన ప్రచార కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ కేతావతు కస్తూరి ఆదివారం తెలిపారు. సర్పంచ్ మాట్లాడుతూ తొలుత జాతిపిత గాంధీజీ చిత్రపటానికి నివాళులర్పించిన అనంతరం ఆజాదీకా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా కుష్టు వ్యాధి అవగాహన కార్యక్రమ సందేశమిస్తామన్నారు. గ్రామ పరిధిలోని ఐదు సచివాలయ సిబ్బంది, వలంటీర్లు గ్రామ పంచాయతీ కార్యక్రమం వద్ద జరిగే కార్యక్రమానికి హాజరు కావాలని కోరారు.

నూతన వధూవరులకు శుభాకాంక్షలు



పామర్రు: నూతన వధూవరులకు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక, ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ శుభాకాంక్షలు తెలిపారు. ఎలకుర్రు ఎంపీటీసీ పల్లికొండ రత్నకుమారి కుమారుడు వివాహ వేడుకలు స్థానిక విజయవాడ రోడ్డులోని ఆరేపల్లి కల్యాణ మండపంలో ఆదివారం జరిగింది. నూతన వధూవరులు ఆకాష్, లీల నవ్యలను ఆశీర్వదించి, శుభాకాంక్షలు తెలిపారు. ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్, వైస్ ఎంపీపీ ఆరేపల్లి శ్రీనివాసరావు, ఎంపీటీసీలు, పలు గ్రామాల సర్పంచ్‌లు, మండల స్థాయి అధికారులు, కార్యదర్శులు, నాయకులు పాల్గొన్నారు.

నవరత్నాలతో అభివృద్ధికి బాటలు

ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు



పెదకామనపూడిలో ప్రభుత్వ పథకాల లబ్ధిపై ఆరా తీస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్

ముదినేపల్లిరూరల్: ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాలతో రాష్ట్రంలో అభివృద్ధికి బాటలు వేస్తున్నారని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) అన్నారు. వడాలి సచివాలయ పరిధిలోని పెదకామనపూడిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డీఎన్నార్ మాట్లాడుతూ.. ప్రజాసంకల్ప పాదయాత్రలో ప్రజలు పడుతున్న పాట్లను వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేరుగా గమనించి పలు హామీలు ఇచ్చారన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే హామీలను నెరవేర్చడమే కాకుండా అనేక కొత్త పథకాలు ప్రవేశపెట్టి రాష్ట్రాభివృద్ధికి బాటలు వేస్తున్నట్లు చెప్పారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా దీర్ఘకాలం పాటు కొనసాగితే రాష్ట్రం దేశంలోనే అన్ని రంగాల్లో అభివృద్ధి చెందడంతో పాటు అన్నివర్గాల ప్రజలు ఆర్థికాభివృద్ధి సాధిస్తారన్నారు.

ప్రతిపక్ష నేతలకు గుణపాఠం చెప్పాలి..

రాష్ట్ర రాజకీయాలపై ఏమాత్రం అవగాహన లేని పార్టీల నేతలు ముఖ్యమంత్రిపై విమర్శలు చేస్తుండడం దారుణమని ఎమ్మెల్యే డీఎన్నార్ మండిపడ్డారు. ఇలాంటి నేతలకు ప్రజలు తగిన రీతిలో గుణపాఠం చెప్పాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. కార్యక్రమానికి ముందు గ్రామంలోని అంబేడ్కర్ విగ్రహానికి ఎమ్మెల్యే, పార్టీ నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యేకు ప్రజలు ఘనస్వాగతం పలికారు. ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ, జెడ్పీటీసీ ఈడే వెంకటేశ్వరమ్మ, హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ గంటా సంధ్య, సర్పంచ్ సైదాల శ్రీనివాస్, ఎంపీటీసీ పల్లి శ్రీదేవి, వైస్ ఎంపీపీలు రాచూరి రాధా, చొప్పర్ల సునీత, వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు మోట్రు ఏసుబాబు, నిమ్మగడ్డ భిక్షాలు, బొర్రా శేషుబాబు, ఈడే వెంకటేశ్వరరావు, కోమటి విష్ణువర్ధన్, బేతపూడి వెంకటరమణ, రాచూరి కుమార్, లేళ్ల ఆంజనేయులు, గూడపాటి వరప్రసాద్, దర్శే నాగేంద్ర, కోటే సీయేను, శ్యామనూడి శ్రీకాంత్, శీలం రామకృష్ణ, ముంగర గోపాలకృష్ణ, బలే నాగరాజు, వివిధ శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్యానికి పెద్దపీట



నేతాజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కొడాలి నాని

గుడివాడటౌన్: రాష్ట్రంలోని ప్రతి ఒక్కరూ మెరుగైన వైద్యసేవలు పొందాలనేదే రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆకాంక్ష అని గుడివాడ ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) అన్నారు. ఆదివారం ఆయన నివాసంలో పలు సమస్యలపై వచ్చిన వారితో ఆయన సానుకూలంగా స్పందించారు. ప్రత్యేకించి సీఎం సహాయనిధికి అందరూ అర్హులేనన్నారు. ఆరోగ్యశ్రీలో చేర్చని క్లిష్టమైన వ్యాధులకు సైతం ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి ఆర్థిక సహాయం అందిస్తున్నామని చెప్పారు. ఇటీవల ఓ విద్యార్థికి కాలేయ మార్పిడి చికిత్స అవసరం కాగా తక్షణమే రూ.25 లక్షలు సీఎం అందజేశారన్నారు. ఏ ఒక్కరూ ఆరోగ్య ఇబ్బందులతో బాధపడుతూ మనోధైర్యాన్ని కోల్పోవలసిన అవసరంలేదని ఆయన తెలిపారు.

వైద్యసేవలకు ఎమ్మెల్యే వితరణ

గుడివాడటౌన్: అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తికి ఎమ్మెల్యే కొడాలి నాని రూ.10 వేలు వితరణ అందజేశారు. స్థానిక కాకర్ల వీధిలో ఆదివారం ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఆయనను అనారోగ్యంతో బాధపడుతున్న దంపతులు కలిశారు. తమ ఆరోగ్య స్థితి బాగుండలేదని వృద్ధాప్యంలో ఇబ్బందులు పడుతున్నామని ఎమ్మెల్యే నానికి వివరించారు. దీనిపై స్పందించిన ఆయన రూ.10 వేలు వితరణ అందజేసి వైద్యం, ఇతర ఖర్చులకు వినియోగించుకోవాలని సూచించారు.

నేతాజీ కుటుంబ సభ్యులకు పరామర్శ

గుడివాడటౌన్: కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, నియోజకవర్గ ఇన్‌చార్జి గానుగుల వీర నేతాజీ పార్టీ పట్ల పూర్తి విశ్వాసంతో అంకిత భావంతో పనిచేసేవారని ఎమ్మెల్యే కొడాలి నాని అన్నారు. ఆదివారం స్థానిక కాకర్ల వీధిలో ఇటీవల మృతిచెందిన కాంగ్రెస్ నాయకుడు వీర నేతాజీ కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించారు. ఆయన చిత్రపటానికి నివాళులర్పించి, ఆయన సేవలను కొనియాడారు. చుండూరి శేఖర్, కృష్ణమోహన్, టి.రమణకుమార్, వెంపటి సైమన్, వసి, షేక్ బాజీ పాల్గొన్నారు.

సందడిగా పూర్వ విద్యార్థుల సమ్మేళనాలు



మండవల్లి హైస్కూల్‌లో 1994-95 బ్యాచ్ పూర్వ విద్యార్థులు



ఆరుతెగరకపాడు స్కూల్‌లో పూర్వ విద్యార్థుల కలయిక

కైకలూరు(కలిదిండి): ఒకటి కాదు.. రెండు కాదు.. ఏకంగా 48 సంవత్సరాల తర్వాత పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు కలుసుకున్నారు. ఇందుకు కలిదిండి మండలం ఆరుతెగశపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వేదికైంది. పూర్వ విద్యార్థులు పేటేటి వెంకటేశ్వరరావు, కనకలింగేశ్వరరావు, జి.రాంప్రసాద్, ఎం.రాజశేఖర్, రంగాచారిల కృషితో పాఠశాలలో 1974–75లో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు ఆదివారం ఒకే చోట కలుసుకున్నారు. అలనాటి తీపి గుర్తులను నెమరువేసుకున్నారు. ఒకరినొకరు పరిచయాలు చేసుకుని కుటుంబ యోగక్షేమాలు తెలుసుకున్నారు. తమకు పాఠాలు చెప్పిన ఉపాధ్యాయులు బాబురావు, శేషగిరిరావు, హరినాథ్, రామ్మోహన్‌రాయ్, కుసుమాంబ, జ్ఞానసుందరి, ప్రస్తుత స్కూల్ హెచ్‌ఎం బి.వెంకట్రావులను పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించారు. సర్పంచ్ పేటేటి స్వర్ణకుమారి, పాండురంగారావు పాల్గొన్నారు.

మండవల్లి: మండవల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం 1994–95 సంవత్సరం పదో తరగతి పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. చిన్ననాటి మిత్రులను కలిసి ఒకరికొకరు యోగ క్షేమాలు తెలుసుకుని ఆప్యాయంగా పలకరించుకున్నారు. ఆనాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. విద్య నేర్పిన గురువులు కె.సూర్యారావు, పి.లక్ష్మీనరసింహారెడ్డి, ఎ.కనకమహాలక్ష్మి, కె.జానకీరామారావు, ఎల్ఎస్ భాస్కరరావు, ల్యాబ్ అసిస్టెంట్ ఎ.వెంకటేశ్వరరావులను సత్కరించారు. సర్పంచ్ మెండా ఝాన్సీ, ఐక్య వేదిక భాస్కరరావు మాట్లాడుతూ తాము చదివిన పాఠశాల అభివృద్ధికి తమ వంతు సహకారం అందజేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. అందరి చిరునామాలు సేకరించి, కలుసుకోవటానికి కృషి చేసిన మెండా సురేష్ దంపతులు, జి.ముఖేష్, ముళ్లపూడి శ్రీదేవి దంపతులను సన్మానించారు. అప్పాపురం సర్పంచ్ బి.భోగేశ్వరరావు, ఎల్‌వీ ప్రసాద్, కేపీ సురేష్, సతీష్, గణేష్, విద్యార్థుల తండ్రులు గొల్లపూడి సత్తిబాబు, కేవీవీ ప్రసాద్ పాల్గొన్నారు.

గుడివాడటౌన్: స్థానిక ఏఎన్నార్ కళాశాలలో 1993–96 బ్యాచ్ బీఎస్సీ విద్యార్థుల కలయిక ఆదివారం కళాశాలలో జరిగింది. విద్యార్థులు తమకు విద్యనేర్పిన గురువులను ఘనంగా సత్కరించారు. పరస్పరం తమ చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుని ఆనందంగా ఉల్లాసంగా గడిపారు. దీంతో కాలేజీ ప్రాంగణంలో సందడి వాతావరణం నెలకొంది. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్, మాజీ ప్రిన్సిపాల్స్, పూర్వ అధ్యాపకులు, ప్రస్తుత అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



అధ్యాపకులతో ఏఎన్నార్ పూర్వ విద్యార్థులు

ఎంపీడీఓ మల్లీశ్వరికి అభినందనలు

మండవల్లి: ఉత్తమ సేవలకు గాను ఏలూరు జిల్లా కలెక్టర్ చేతులమీదుగా ప్రంశసాపత్రం అందుకున్న మండవల్లి ఇన్‌చార్జి ఎంపీడీఓ పి.మల్లీశ్వరిని ఎంపీపీ పెద్దిరెడ్డి శ్రీరామదుర్గాప్రసాద్(రాము), మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఆదివారం అభినందించారు. శాలువాతో సత్కరించి, బొకే అందజేశారు. ఎంపీపీ మాట్లాడుతూ భవిష్యత్‌లో మరిన్ని అవార్డులు అందుకుని ఖ్యాతిగడించాలని పేర్కొన్నారు.

వక్ఫ్ బోర్డు డైరెక్టర్ల నియామకంపై హర్షం



నూతన డైరెక్టర్లను అభినందిస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్

కైకలూరు: ఏలూరు జిల్లా వక్ఫ్ బోర్డ్‌లో నియోజకవర్గానికి చెందిన ఇరువురికి డైరెక్టర్లుగా అవకాశం లభించింది. వైఎస్సార్ సీపీ పట్ల అంకితభావంతో పనిచేసిన కలిదిండి మండలానికి చెందిన షేక్ ఖాన్ బాషా, కైకలూరుకు చెందిన షేక్ రహంతుల్లాకు నియామక ఉత్తర్వులు ఆదివారం అందాయి. దీంతో నియామకానికి కృషి చేసిన చేసిన ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్)ను స్థానిక నివాసం వద్ద మర్యాదపూర్వకంగా ముస్లింలు కలిసి కృతజ్ఞతలు తెలిపారు. కైకలూరు వైస్ ఎంపీపీ మహమ్మద్ జహీర్, ఎంపీటీసీ సభ్యుడు సఫాయితుల్లా, ఏఎంసీ డైరెక్టర్ షేక్ ముసా, ముస్లింలు షేక్ రఫీ, అబ్దుల్ హమీద్, దండే రవిప్రకాష్ పాల్గొన్నారు.

ఆక్వా జోన్ సర్వేలో ఇబ్బందులు తొలగించండి

కైకలూరు: ఆక్వా జోన్‌లోకి నాన్ ఆక్వాజోన్ చేపల, రొయ్యల చెరువుల సర్వే నంబర్లు చేర్చే ప్రక్రియలో ఇబ్బందులను తొలగించాలని ఎమ్మెల్యే డీఎన్నార్ అధికారులకు సూచించారు. కైకలూరు పార్టీ కార్యాలయంలో మత్స్య, విద్యుత్ శాఖల అధికారులతో ఆదివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆక్వా జోన్, నాన్ ఆక్వా జోన్ కేటగిరీల వారీగా సర్వే నిర్వహించారన్నారు. కొంత మంది అర్హులైన రైతుల పేర్లు అనర్హుల జాబితాలో వచ్చాయని, దీని కారణంగా వారు ప్రభుత్వ విద్యుత్ సబ్సిడీకి దూరమవుతారన్నారు. ఇటువంటి రైతుల భూములను రీసర్వే చేసి అర్హత జాబితాలో చేర్చాలన్నారు. ఈ విషయమై మత్స్యశాఖ కమిషనర్ కన్నబాబుతో ఫోన్‌లో మాట్లాడారు. అర్హులైన ప్రతి ఆక్వా రైతుకు సబ్సిడీ అందిస్తామన్నారు. సమావేశంలో మత్స్యశాఖ ఏడీ ఆర్.ప్రతిభ, విద్యుత్‌శాఖ ఏడీ బి.రామయ్య, మత్స్యశాఖ అభివృద్ధి అధికారులు ఎం.భవిత, బి.శ్రీనివాస్, సతీష్‌కుమార్, విద్యుత్‌శాఖ ఏఈలు సత్యనారాయణ, నాగేశ్వరరావు, రవికుమార్, మల్లిఖార్జున్, రామకృష్ణ, గ్రామ మత్స్యశాఖ సహాయకులు పాల్గొన్నారు.

చిన్న పరిశ్రమలకు అండగా ఉంటాం



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే నాని, నేతలు

గుడివాడటౌన్: చిన్న తరహా పరిశ్రమల అభివృద్ధికి తమ ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే కొడాలి నాని అన్నారు. స్థానిక కాకర్ల వీధిలోని జయలక్ష్మి ఇంజినీరింగ్ వర్క్స్ అధినేత అల్లం రామ్మోహనరావు గృహంలో సంస్థ క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చే నాటికి చిన్న తరహా పరిశ్రమలకు సంబంధించి గత ప్రభుత్వం రూ.500 కోట్లు బకాయి ఉండగా సీఎం వైఎస్ జగన్ రూ.350 కోట్లు విడుదల చేశారన్నారు. మిగిలిన బకాయిలను త్వరలో విడుదల చేస్తారని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు దుక్కిపాటి శశిభూషణ్, పాలేటి చంటి, శేషగిరిరావు, మున్సిపల్ మాజీ కౌన్సిలర్లు అల్లం సూర్యప్రభ, వెంకటలక్ష్మి, మూడెడ్ల ఉమ, హారిక, రమీజా, సునీత, రాణి పాల్గొన్నారు.

విద్యార్థుల్లో సత్ప్రవర్తనే మానవత లక్ష్యం



పామర్రు: విద్యార్థుల్లో సత్ప్రవర్తన పెంపొందించేందుకు మానవత ఆధ్వర్యంలో కెరీర్ గైడెన్స్‌పై శిక్షణా తరగతులను నిర్వహిస్తున్నట్లు పామర్రు మానవత రీజియన్ చైర్మన్ పీఎంఎస్ ప్రసాద్ అన్నారు. స్థానిక అరండల్ పేటలోని మానవత కార్యాలయం వద్ద సర్వ సభ్యసమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవత ద్వారా ఎన్నో వినూత్న సేవా కార్యక్రమాలను నిర్వహించి ప్రజలకు సేవలను అందిస్తున్నామన్నారు. విద్యార్థుల్లో పరివర్తన కల్గించేందుకు కెరీర్ గైడెన్స్‌పై శిక్షణా తరగతులను నిర్వహించి వారిలో మార్పు తీసుకువచ్చే విధంగా కృషి చేస్తామని చెప్పారు. సమావేశంలో మానవత చైర్మన్ శీతాల ప్రసాద్, కార్యవర్గ ప్రతినిధులు కొల్లా శ్రీనివాసరావు, ఎస్.త్రివిక్రమరావు, వైఎస్ఎన్ ప్రసాద్, రెడ్రౌతు నరసింహారావు, ఏ సోమశేఖరరావు, టి.వేణు ప్రసాద్, జి.రంగారావు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.